

## అకాల వర్షం.. అపార నష్టం

పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న అన్నదాతలపై ప్రకృతి కన్నెర్ర చేసింది. అకాల వర్షంతోపాటు ఈదురు గాలులతో రైతులకు అపారనష్టం కలిగింది. -8లో



## నకిలీ ఫోన్ పే మోసగాళ్ల అరెస్ట్

నకిలీ ఫోన్ పే యాప్ ఉపయోగించి మూడు నెలలుగా జనరల్ స్టోర్‌లో మోసం చేస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో

గరిష్టం/కనిష్టం
37.2/25.4

## వాతావరణం

జిల్లాలో గురువారం 25.4 – 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### 7 నుంచి 'ఎన్టీఆర్ వైద్య సేవ'లు నిలిపివేత

కడప రూరల్: 'ఎన్టీఆర్ వైద్య సేవ'లను ఈ నెల 7వ తేదీ నుంచి నిలిపివేయనున్నట్లు ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించనందున ఆసుపత్రుల నిర్వహణ కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. తమ సమస్యలను ప్రభుత్వానికి పలు దఫాలు విన్నవించినా ఫలితం లేదని తెలిపారు. బిల్లులు మంజూరు కానందున తప్పని పరిస్థితుల్లో వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

### డీఈఓ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని కడప మున్సిపల్ కార్పొరేషన్ కడప, ప్రొద్దుటూరు మునిసిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల, తత్సమాన కేటగిరీల నుంచి పాఠశాల సహాయకుల పదోన్నతి కోసం సీనియారిటి జాబితా సబ్జెక్టుల వారీగా జిల్లా విద్యాశాఖ అధికారి www.kadapadeo.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. సదరు సీనియారిటీ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రాత పూర్వకంగా సరైన ఆధారాలతో డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని డీఈఓ పేర్కొన్నారు.

### 9న కడప బిషప్ పట్టాభిషేక ఉత్సవం

కడప కల్చరల్: కడప కథోలిక పీఠం బిషప్‌గా మోస్ట్ రెవరెండ్ డాక్టర్ పాల్ ప్రకాశ్ సగినాలకు ఈనెల 9న ఉదయం 10 గంటలకు పట్టాభిషేకం నిర్వహించనున్నారు. కడప బిషప్స్ హౌస్ సమాచారం మేరకు....స్థానిక మరియాపురంలోని సెయింట్ జోసెఫ్స్ బాలుర హైస్కూలు మైదానంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రస్తుత అపోస్తలిక అడ్మినిస్ట్రేటర్ ఆఫ్ కడప డయాసిస్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ గాలిబాలి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన ఆర్చి బిషప్ ఆంథోని కార్డినల్ పూల, నెల్లూరు బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ మోసెస్ డి.ప్రకాశం, విజయవాడ బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ టి.జోసెఫ్ రాజారావు ప్రధాన అతిథులుగా హాజరు కానున్నారు. భారత నేపాల్ అపోస్థోలిక నాన్సియో మోస్ట్ రెవరెండ్ డాక్టర్ లియోపోల్డో గిరెల్లి ముఖ్య అతిథిగా కార్యక్రమాన్ని ఆశీర్వదించనున్నారు.

### 26 నుంచి శిక్షణ తరగతులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని హోచిమన్ భవన్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నగరంలోని హోచిమన్ భవన్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యారంగం సంక్షోభంలో ఉందన్నారు.అశాస్త్రీయ భావాలతో విద్యార్థుల మెదడులో కాషాయీకరణకు ప్రేరేపిస్తున్నారని ధ్వజమెత్తారు. మూడు రోజుల పాటు జరిగే రాజకీయ శిక్షణ తరగతుల్లో వివిధ రంగాల్లోని ప్రొఫెసర్లు, మేధావుల చేత రాజకీయ అభ్యున్నత విద్య, సామాజిక, వైద్య అంశాలకు శిక్షణ ఉంటుందన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు శివశంకర్ పాల్గొన్నారు.

# అల.. ఏకశిలానగరిలో..

రాష్ట్ర విభజన తర్వాత ఒంటిమిట్ట రామాలయం టీటీడీలోకి విలీనమైంది. టీటీడీ ఏటా బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తోంది. ఈ ఏడు కూడా ఈ నెల 5 నుంచి 15 వరకు బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. తొలిరోజున అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. ఈనెల 11న రాములోరి కల్యాణం కన్నుల పండువగా చేయనున్నారు. ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట రామయ్య క్షేత్రం ప్రత్యేక కళను సంతరించుకుంది.

- జాంబవంతుడు ప్రతిష్ఠించిన రామక్షేత్రం!
- త్రేతాయుగంలో సీతారామలక్ష్మణ నివాసమే ఏకశిలానగరం
- ఆంజనేయుడు లేకపోవడమే ఆలయ ముఖ్య విశేషం
- వంటడు..మిట్టడుతో ఆలయ నిర్మాణానికి అంకురార్పణ
- రేపటి నుంచి ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలు
- 11న రాములోరి కల్యాణానికి టీటీడీ సమాయత్తం

ఒంటిమిట్ట (రాజంపేట): ఒంటిమిట్టలోని కోదండ రామాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబయింది. ఈ నెల 5వ తేదీ నుంచి 15 వరకు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టనున్నారు. రోజుకొక అలంకారంలో రామయ్య భక్తులకు దర్శనమివ్వనున్నాడు.

**ప్రధాన విశేషం..**

సీతారామలక్ష్మణులు కొలువుదీరిన ఏ ఆలయంలో అయినా హనుమ కూడా దర్శనమిస్తారు. అయితే ఒంటిమిట్ట గుడిలో సీతారామలక్ష్మణులు మాత్రమే ఏకశిలపై దర్శనమిస్తారు. ఆంజనేయుడి విగ్రహం లేదు. అయితే ఆలయ తూర్పు గాలిగోపురానికి తూర్పుగా రథశాల పక్కనే సంజీవరాయుడుగా వెలసిన ఆంజనేయస్వామి గుడి నిర్మించారు.



ఒంటిమిట్ట కోదండ రామాలయం వ్యూ



ఏకశిలపై సీతారామలక్ష్మణ మూర్తులు

**త్రేతాయుగంలో సీతారామలక్ష్మణ నివాసం..**

త్రేతాయుగంలో సీతారామలక్ష్మణులు ఈ ప్రాంతంలో కొంతకాలం నివసించారని పురాణ కథనం. అప్పుడు సీతమ్మకు దప్పిక అయింది..రాముడు బాణం సంధించి భూమిలోకి వదిలాడు. నీరుపైకి ఎగజిమ్మింది. సీతమ్మ దప్పిక తీరింది. లక్ష్మణుడు అన్న అనుజ్ఞతో తాను ఒక బాణం వదిలాడు. నీరుపైకి వచ్చింది. ఆ నీటిబుగ్గలనే నేడు రామతీర్థం ..లక్ష్మణతీర్థం అని పిలుస్తున్నామనే కథ పురాణాల ద్వారా తెలుస్తోంది.

**ధర్మ సంస్థాపన కోసం ఒంటిమిట్ట గుడి..**

రాముడిక్కడ కోదండం ధరించి ఉన్నాడు. కోదండం ధర్మరక్షణకు ప్రతీక. అలనాడు శ్రీరామచంద్రుడు అడవుల్లో తిరుగుతూ నార వస్త్రాలు ధరించినా కోదండాన్ని విడువలేదు. అది ధర్మరక్షణ కోసమే. బుక్కరాయలు తర్వాత సిద్ధవటం మట్లిరాజులు ఆలయాన్ని అత్యంత వైభవోపేతంగా తీర్చిదిద్దారు. అనంతరాజు, తిరుమలరాయలు, తిరువెంగళనాథరాజు, కుమార అనంతరాజులు ఒంటిమిట్ట కోవెలను తీర్చిదిద్దారు. ఉన్నతమైన ప్రాకారకుడ్యాలు సమున్నతమైన గోపుర శిఖరాలు రంగమంటపాల్లో అద్భుత శిల్పవిన్యాసాలు కనిపిస్తాయి.

**ఏకశిలానగరానికి ఎలా చేరుకోవాలంటే..**

చెన్నై–ముంబాయి రైలుమార్గంలోని ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో దిగి ఒంటిమిట్ట(ఏకశిలానగరం)కు చేరుకోవచ్చు. కడప నుంచి రేణిగుంట తిరుపతికి వెళ్లే బస్సు మార్గంలో , కడప నుంచి 25కిలోమీటర్ల దూరంలో ఒంటిమిట్ట వస్తుంది.

**ఆలయ చరిత్ర..**

విజయ నగర సామ్రాజ్యంలో క్రీ.శ 1340లో ఉదయగిరి పాలకుడు కంపరాయలు ఒంటిమిట్ట ప్రాంతంలో పర్యటించారు. ఆయన కొంతపరివారాన్ని వెంటబెట్టుకొని వచ్చాడు. ఈ అడవుల్లో ఇద్దరు బోయలు ఉండేవారు. వారే వంటడు, మిట్టడు. వీరు రాజుగారికి సేవలందించారు. ఈ సమయంలో సమీపంలో గుట్టమీద చిన్నపాటి గుడి ఉంది. జాంబవంతుడు నిలిపిన శిలలో సీతారామలక్ష్మణులని భావించి దండం పెట్టుకొంటున్నారని, అక్కడ గుడి కట్టి పుణ్యం కట్టుకోమన్నారు. సీతమ్మను వెతుకుతూ ఒకనాడు జాంబవంతుడు ఈ గుట్టమీద విశ్రమించాడని, ఆరాత్రి అక్కడే నిద్రించాడని ఉదయం తిరిగి వెళ్తూ ఆ శిలలో సీతారామలక్ష్మణులను భావించుకొని నమస్కరించుకొని వెళ్లాడట. వంటడు..మిట్టడు చెప్పిన మేరకు కంపరాయులు గుడి, చెరువు నిర్మించేందుకు అంగీకరించారు. ఆ బాధ్యత బోయలకే అప్పగించారు. కాగా.. ఒంటడు.. మిట్టడు.. ఆలయ నిర్మాణంలో భాగం అయ్యారు గనుకనే ఈ ఆలయానికి ఒంటిమిట్ట అనే పేరు వచ్చిందనే పురాణ కథ ప్రాచుర్యంలో ఉంది.

**కోదండరాముడి బ్రహ్మోత్సవాల వివరాలు..**

| తేది (ఏప్రిల్) | ఉదయం | రాత్రి |
|---|---|---|
| 06 | ధ్వజారోహణం | శేష వాహనం |
| 07 | వేణుగానాలంకారం | హంస వాహనం |
| 08 | వటపత్రసాయి అలంకారం | సింహ వాహనం |
| 09 | నవనీత కృష్ణాలంకారం | హను మత్సేవ |
| 10 | మోహినీ అలంకారం | గరుడ సేవ |
| 11 | శివధనుర్భాలంకారం | గజ వాహనం |
| 12 | రథోత్సవం | |
| 13 | కాళీయమర్ధన అలంకారం | అశ్వవాహనం |
| 14 | చక్రస్నానం | ధ్వజాఅవరోహణం |
| 15 | సాధారణ కార్యక్రమాలు | పుష్పయాగం, ఏకాంతసేవ |

**ఏకశిలానగరంగా..**

ఒంటిమెట్ట మీద నిర్మించిన ఆలయం ఉన్న ప్రదేశం ఒంటిమిట్ట అయింది. ఒంటిమిట్ట గుడికి అనురూపంగానే ఏర్పడిన మరోపేరు ఏకశిల. ఒకేశిలలో సీతారామలక్ష్మణ విగ్రహాలు నిర్మితమై ఉన్నాయి. ఇది అరుదైన సంగతి. జాంబవంతుడు ముగ్గుర్ని ఒకే శిలలో భావించుకొన్నాడు. ఆ తర్వాత కాలంలో కంపరాయలు, బుక్కరాయలు అదే సంప్రదాయంతో ఏకశిలలో ముగ్గురు మూర్తులు ఉండేటట్లు నిర్మాణం చేయించారు. బహుశా ఒకే శిలలో ముమ్మూర్తులను నిలిపిన సంఘటన ఒంటిమిట్టలో మొదటిగా ఆవిష్కృతమైంది. అరుదుగా కొలువైన ఏకశిలావిగ్రహ ప్రాంతాన్ని ఏకశిల అని భక్తితో అన్నాడు పోతన.

**రాత్రిపూటే కల్యాణం..**

ఒంటిమిట్ట స్వామివారి కల్యాణం రాత్రిపూట నిర్వహిస్తారు. చతుర్దశినాటి రాత్రి వివాహ మహోత్సవం, కళాపూర్ణుడైన చంద్రుడు సీతారామ కల్యాణాన్ని పరమానందంతో తిలకిస్తాడని పురాణకథ చెపుతోంది. కాగా రాత్రి కల్యాణం సంప్రదాయం ఇప్పటిదికాదు. అది ఒంటిమిట్ట ఆలయం ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇలాగే జరుగుతోంది. అన్ని రామాలయాలలో నవమిరోజున కల్యాణం నిర్వహిస్తారు. అది పగటిపూట. ఒక్క ఒంటిమిట్ట కోదండరామాలయంలోనే రాత్రి పూట రాములోరి కల్యాణం జరుగుతుంది. ఈ నెల11న రాత్రి 8–10 గంటలలోపు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు.

**రామయ్య సేవలో కవులు**

ఒంటిమిట్ట కోదండరామాలయంలో వెలసిన రఘురాముడిని సేవిస్తూ కవులెందరో తరించారు. వారిలో అయ్యలరాజు తిప్పయ్య, బమ్మెర పోతన, అయ్యలరాజు రామభద్రుడు, ఉప్పుగొండూరు వెంకట కవి, వరకవి నల్లకాల్వ అయ్యప్ప, వాసుదాసు వావిలికొలను సుబ్బారావులు తమతమ స్థాయిలో కోదండరామునిపై సాహిత్యం, కీర్తనలు, రచనలుతోపాటు ఆలయ అభివృద్ధికి తోడ్పడ్డారు.

**ఆలయ నిర్మాణం ఇలా..**

విజయ నగర సామ్రాజ్య చక్రవర్తి బుక్కరాయలు ఒంటిమిట్ట గుడిలో ఏకశిలా విగ్రహం నిలిపిన నాటికి గర్భాలయం, అంతరాళం, చిన్నగోపురం ఉండేవి. మొదటి దశ నిర్మాణమిది. మూడవ దశలో మహా మంటపం (రంగ మంటపం), మహా ప్రాకారం, తూర్పు, ఉత్తర , దక్షిణ గాలిగోపురాలు, మహా ప్రాకారం లోపల నైరుతి దిక్కున కళ్యాణ మంటపం, ఆగ్నేయ దిశలో పాకశాల, ప్రాకారంలోపల ఉత్తరం వైపు తూర్పున, పడమర ఎదుర్కోలు మంటపాలు, రామలింగదేవుని గుడి (1966)లో లింగాన్ని నిలిపారు. సంజీవరాయస్వామి, రథం, రథశాలను ఏర్పాటుచేశారు. అనంతరం అనంతరాజు గుడిని విస్తరించాడు. మహామంటపం, మహాప్రాకారం, గాలిగోపురాల నిర్మాణాలు చేపట్టారు. తెలుగురాష్ట్రాలలో ఒంటిమిట్ట గాలిగోపురాల తరహాలో మరెక్కడా కనిపించవు. ఈ ఆల యాన్ని దర్శించిన టావెర్నియర్ అనే యాత్రికుడు ఎత్తయిన గోపురాలు చూసి విస్మయం చెందాడు.



ఒంటిమిట్ట కోదండ రామాలయం వద్ద విద్యుత్ దీపాలతో అలంకరణ

**రామయ్యకు బ్రహ్మోత్సవ శోభ**

ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలతో ఏకశిలానగం శోభాయమానంగా వెలుగొందనుంది. ఇప్పటికే కళ్యాణవేదిక ముస్తాబు, భక్తుల కోసం గ్యాలరీలు చకచకా ఏర్పాటుచేశారు. 60 గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. వీవీవీఐపీ, వీఐపీ, సాధారణ భక్తులను దృష్టిలో ఉంచుకొని గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. దాశరథి కల్యాణానికి వచ్చే భక్తులకు తోపులాట వాతావరణం లేకుండా టీటీడీ చర్యలు తీసుకుంటోంది. రేపటి నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు దాదాపు పూరికావస్తున్నాయి.

**దాశరథి కోవెలలో నవమి ఏర్పాట్లు...**

ఒంటిమిట్టలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరోజున ఆలయంలో పోతన జయంతి కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహించనున్నది. కవిసమ్మేళనం నిర్వహిస్తారు. నవమి సందర్భంగా భక్తులు పెద్దఎత్తున రానున్నారు.

## డయేరియా రహిత జిల్లాగా మారుద్దాం

- 15 నుంచి జిల్లా వ్యాప్తంగా క్యాంపెయిన్
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: డయేరియా రహిత, ఆరోగ్య సహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్నిశాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి డయేరియా నియంత్రణ క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. నియోజకవర్గ, మండ ల, గ్రామ స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ అధికారులు మైక్రో ప్లాన్ అమలు చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పర్యవేక్షణ చర్యలు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డీఎంహెచ్ఓ నాగరాజు, నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి డీపీఓ ఖాదర్‌బాషా, రిమ్స్ సూపరింటెండెంట్ రమాదేవి, ఎపిడమాలజిస్టు ఖాజా మోహిద్దీన్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీఎంహెచ్ఓ

## ప్రారంభమైన పది మూల్యాంకనం

**తొలి రోజు 12,910 సమాధాన పత్రాలకు మూల్యాంకనం**

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనం గురువారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ప్రారంభమైంది. ఈ మూల్యాంకనానికి క్యాంపు ఆఫీసర్‌గా డీఈఓ షేక్ షంషుద్దీన్ వ్యవహరించారు. ఈ మూల్యాంకనానికి రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి అన్ని సబ్జెక్టులకు సంబంధించి 1,75,934 పేపర్లు వచ్చాయి. ఈ మూల్యాంకన విధుల్లో 105 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 604 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 198 మంది స్పెషల్ అసిస్టెంట్లు పాల్గొని 12,910 పేపర్లను మూల్యాంకనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు ఆఫీసర్, డీఈఓ షేక్ షంషుద్దీన్ మాట్లాడుతూ ఈ మూల్యాంకన ప్రక్రియ ఈ నెల 9 వరకు జరుగుతుందన్నారు. తొలి రోజు 12, 910 పేపర్లను మూల్యాంకనం చేశారని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేసు తెలిపారు.



సిబ్బందితో కలిసి మూల్యాంకన కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

## రాములోరి కల్యాణానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఒంటిమిట్టలో జరిగే శ్రీ కోదండరామస్వామి కల్యాణోత్సవానికి ఈనెల 11న జిల్లాలోని వివిధ డిపోల నుంచి 135 ప్రత్యేక బస్సులను నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి 35, పులివెందుల 10, బద్వేలు 20, జమ్మలమడుగు 10, మైదుకూరు 5, ప్రొద్దుటూరు 15, ఇతర రీజియన్ డిపోల నుంచి 40 బస్సులు చొప్పున మొత్తం 135 బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. కడపవైపు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం నుంచి కల్యాణోత్సవం జరిగే ప్రాంతానికి ఐదు ఉచిత బస్సులు, రాజంపేట వైపు సాలాబాద్ క్రాస్ పార్కింగ్ స్థలం నుంచి కల్యాణోత్సవం జరిగే ప్రాంతానికి మరో ఐదు ఉచిత బస్సులను నడపనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: పౌర్ణమి సందర్భంగా ఈనెల 11, 12 తేదీల్లో గిరి ప్రదక్షిణ నిమిత్తం అరుణాచలానికి జిల్లాలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప నుంచి ఈనెల 11న రాత్రి 10, 12న ఉదయం 9.30 గంటలకు రాయచోటి,చిత్తూరు,వేలూరు మీదుగా బస్సులు బయలుదేరుతాయన్నారు.
- బద్వేలు డిపో నుంచి 12న ఉదయం 9 గంటలకు కడప, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ మీదుగా అల్ట్రా డీలక్స్ బస్సు బయలుదేరుతుంది.
- మైదుకూరు డిపోనుంచి 11వ తేదిన ఒక బస్సు పోరుమామిళ్లలో మధ్యాహ్నం 3.00 గంటలకు బయలుదేరి కడప, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ మీదుగా, మరొకబస్సు మైదుకూరులో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి కడప,చిత్తూరు మీదుగా వెళుతుంది.
- ప్రొద్దుటూరు డిపో నుంచి 11వ తేదిన సాయంత్రం 6 గంటలకు మైదుకూరు, కడపమీదుగా బస్సు సర్వీసు ఉంటుంది.
- పులివెందుల డిపో నుంచి ఈనెల 12న ఉదయం 7.00 గంటలకు రాయచోటి, పీలేరు మీదుగా అరుణాచలానికి సర్వీసు ఉంది.
- జమ్మలమడుగు డిపో నుంచి ఈనెల 11వ తేది రాత్రి 8 గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా బస్సు సర్వీసు ఉంది. జిల్లాలోని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తమ టిక్కెట్లను ముందుగానే రిజర్వు చేసుకోవాలని సూచించారు.

# ఖాకీ వనంలో కలుపు మొక్కలు!

- అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం తాపత్రయం
- ఎన్నికల కమీషన్ ఆదేశాలు ఉల్లంఘించినా కేసుల్లేవు
- గోపవరం ఉపసర్పంచ్ ఎన్నికలో ప్రజాస్వామ్యం అపహాస్యం
- ఫేక్ ఐడీలతో పట్టుబడినా చర్యల్లేవ్
- 'దేశం' నేతలు కావడంతో చట్టపరమైన చర్యలకు వెనుకంజ

సాక్షి ప్రతినిధి, కడప: సోషల్ మీడియాలో చిన్న పోస్టు పెడితే చాలు... గోడలు దూకి మరీ అరెస్టులు చేసే పోలీసులు...ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్నికల్లో దౌర్జన్యం, దాడులకు దిగితే చూస్తుండిపోయారు. వైఎస్సార్సీపీ సభ్యులపై దాడులు చేసి.. ఫేక్ ఐడీ కార్డులతో ఎన్నికను తారుమా రు చేయాలనుకున్నా.. మౌనాన్నే ఆశ్రయించారు. ఎన్నికలు రూమ్‌లోకి వెళ్లి ఎన్నికల అధికారిపైనే దౌర్జన్యానికి దిగినా నో కేస్. చివరికి ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి సోదరుడు చేసిన దౌర్జన్యానికి ఎన్నికల అధికారికి గుండె పోటు కూడా వచ్చినా నో కేస్. ఇదీ.. కూటమి పాలనలో ఖాకీల పనితీరు.

- ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ చేయని అరాచకం లేదు. సాక్షాత్తు డీఎస్పీ ముందే ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి సోదరుడు అనందభార్గవ్‌రెడ్డితోపాటు పలువురు టీడీపీ నేతలు ఎన్నికల అధికారిపై దౌర్జన్యానికి దిగితే కనీసం కేసు కూడా లేదు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో టీడీపీ దౌర్జన్యకాండను కళ్లకు కట్టినట్లు బహిర్గతం చేశాయి. ఎటువంటి బలం లేని కారణంగా ఎలాగైనా ఉప సర్పంచ్ ఎన్నికను అడ్డుకునేందుకు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి బంధువులు చేయని అరాచకం లేదు. మార్చి 27న వైఎస్సార్సీపీ సభ్యులు ఎన్నికకు వస్తుంటే వారి వాహనంపై దాడి చేసి, మహిళా సభ్యులను సైతం గాయపరిచి ఎన్నికకు రాకుండా అడ్డుకున్నారు. అదే రోజు ఎలాగైనా గెలవాలని నలుగురు వ్యక్తులకు ఫేక్ ఐడీ కార్డులు సృష్టించి ఎన్నిక గదిలోకి పంపినా వారిని కనీసం అదుపులోకి కూడా తీసుకోలేదు. సాక్షాత్తు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను అపహాస్యం చేసే విధంగా వారు వ్యవహరిస్తే చట్టపరమైన చర్యల్లేవు.



ఎన్నికల రూమ్‌లో దౌర్జన్యానికి దిగిన టీడీపీ నేతలు

**ఎన్నికల కమీషన్ ఆదేశాలకే దిక్కులేదు...**

20 మంది వార్డు మెంబర్లు ఉన్న గోపవరం పంచాయితీలో ఉప సర్పంచ్ ఎన్నిక కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకే జిల్లాలో దిక్కులేకుండా పోయింది. ఎన్నికకు సంబంధం లేని తెలుగుదేశం నాయకులు ఎన్నికల రూమ్‌లోకి ప్రవేశించారు. పోలీసు అధికారులు సైతం అదే వీడియోలో కన్పిస్తున్నారు. అయినా నియంత్రించలేదు. పోలీసుల కళ్ల ముందే దౌర్జన్యానికి దిగినా వారికి కనిపించలేదు. మరోవైపు 'ఒక్క ఫోన్ కొడితే చాలు న్యాయం చేస్తా'మని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ప్రకటించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు చేపట్టిన 20 మంది వార్డు మెంబర్లు ఉన్న ఎన్నికల్లో అరాచకం తాండవించినా చట్టపరమైన చర్యలు లేకపోవడం ఎస్పీ ప్రకటనను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. ఆలస్యంగా వీడియోలు బయటకు రావడంతో చిన్న ఉప సర్పంచ్ పదవి కోసం టీడీపీ నేతలు చేసిన దౌర్జన్యకాండ వెలుగు చూసింది. ఇప్పటికైనా జిల్లా పోలీసు యంత్రాంగం చట్టాన్ని పరిరక్షించేందుకు ముందుండాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.



ఫేక్ ఐడీతో వచ్చిన మహిళ



ఫేక్ ఐడీ కార్డుతో ప్రవేశించి పురుషుడు

**ఎన్నికల అధికారికి గుండెపోటు వచ్చేలా....**



ఉప సర్పంచ్ ఎన్నికల రూమ్‌లో ఉన్న మాజీ జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి చిత్రంలో పోలీసులు

తొలి రోజు వాయిదా పడిన ఎన్నిక మరుసటి రోజైన 28న నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు సమాయత్తమైతే వారిపైనే దౌర్జన్యానికి దిగి ఎన్నికల అధికారి రామాంజనేయరెడ్డికి గుండెపోటు వచ్చేలా చేశారు. ఇదంతా కూడా డీఎస్పీ సమక్షంలోనే చోటుచేసుకున్నా ఈ రోజు వరకు కేసు నమోదు కాలేదు. ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి సోదరుడు నంద్యాల అనందభార్గవరెడ్డి మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య కుమారుడు ప్రతాప్, మాజీ జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి ఎన్నికల గదిలోకి ప్రవేశించి దౌర్జన్యానికి దిగారు. టీడీపీకి చెందిన వారు ఎన్నికల అధికారి వద్ద ఉన్న డాక్యుమెంట్లను చించేశారు. కుర్చీలు ఎత్తేసి భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో సదరు ఎన్నికల అధికారి రామాంజనేయరెడ్డికి గుండెపోటు వచ్చింది. ఇప్పుడా వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఇంత తతంగం తెరపైకి వచ్చినా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.

## క్లుప్తంగా

### విద్యార్థిని అదృశ్యం

జమ్మలమడుగు రూరల్‌ : జమ్మలమడుగు పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన ముత్తులూరు ప్రత్యూష (16) అనే విద్యార్థిని కనిపించడం లేదని తల్లి ప్రభావతి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రామక్రిష్ణ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీనగర్‌కు చెందిన ముత్తులూరు ప్రత్యూష పట్టణంలోని ఓ ప్రైవేట్‌ కళాశాలలో ఇంటర్‌ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో అంగడికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రానట్లు గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ప్రభావతి ఫిర్యాదు చేసింది.

### రేషన్‌షాపు సీజ్‌



రికార్డులు పరిశీలిస్తున్న డీటీ శివశంకర్‌

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని రేషన్‌షాపును సీజ్‌ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ శివశంకర్‌ తెలిపారు. 25 క్వింటాళ్ల బియ్యం, 75 కేజీల చక్కెర స్టాకులో తక్కువగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. కేసు నమోదు చేసి ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేశామని పేర్కొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్‌ మృతి



మృతి చెందిన మహమ్మద్‌ అజీజ్‌

జమ్మలమడుగు రూరల్‌ : ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఎస్‌. మహమ్మద్‌ అజీజ్‌ (40) అనే ఆటో డ్రైవర్‌ అనుమానస్పదంగా మృతి చెందాడు. ఎస్‌ఐ బి. రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మహమ్మద్‌ అజీజ్‌ గురువారం ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగుకు బాడుగ కోసం వచ్చాడు. తిరిగి ప్రొద్దుటూరుకు వెలుతుండగా దానవులపాడుకు రాగానే అకస్మాత్తుగా ఆటోలోనే మృతి చెందాడు. అయితే కొంతకాలంగా అజీజ్‌ అనారోగ్యంతో ఉన్నట్లు సమాచారం.

### నకిలీ ఫోన్‌ పే మోసగాళ్ల అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ భవానీ

చాపాడు : నకిలీ ఫోన్‌ పే యాప్‌ ఉపయోగించి మూడు నెలలుగా జనరల్‌ స్టోర్‌లో మోసం చేస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రైనీ డీఎస్పీ భవానీ వివరాలు వెల్లడించారు. చాపాడులోని నక్కలదిన్నె రోడ్డులో గల పెంచల నరసింహా జనరల్‌ స్టోర్‌లో.. చాపాడుకు చెందిన ముత్యాల శివశంకర్‌, లక్ష్మీపేటకు చెందిన భూమిరెడ్డి వీరాంజనేయరెడ్డి, సీతారామాపురానికి చెందిన సాయి గత మూడు నెలలుగా నకిలీ ఫోన్‌ పే యాప్‌ ద్వారా సరకులు కొనుగోలు చేస్తూ మోసానికి పాల్పడ్డారు. రూ.3 లక్షల వరకు సరకులు తీసుకెళ్లడంతోపాటు కత్తితో బెదిరించిన ఘటనపై బుధవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి శివశంకర్‌, వీరాంజనేయరెడ్డి, సాయిలను అరెస్ట్‌ చేసినట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి ఒక మొబైల్‌, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో ఎస్‌ఐ చిన్న పెద్దయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జజ్జనకర జనారే.. జాతర భళారే..!

- వైభవంగా బలిజపల్లె గంగమ్మ జాతర
- ఆకట్టుకున్న యువకుల విన్యాసాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు



ప్రత్యేకంగా తయారు చేసిన గుడిలో కొలువుదీరిన గంగమ్మ



జాతరలో జనసందోహం

రాజంపేట టౌన్‌ : పట్టణంలోని బలిజపల్లెలో గురువారం గంగమ్మ జాతర సంబరం అంబరమంటింది. వేడుక బుధవారం రాత్రి నుంచే అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. తొలుత నిర్వాహణలో భాగస్వాములైన నాపరపురెడ్డిపల్లె నిర్వాహకులు, ప్రజలు.. గంగమ్మ సోదరుడైన పోతురాజును ఊరేగిస్తూ అమ్మవారికి నవధాన్యాలు తీసుకొచ్చారు. అనంతరం గంగమ్మకు పుట్టినిల్లయిన తుమ్మల అగ్రహారం నుంచి.. ఆ గ్రామ మహిళలు పెద్దఎత్తున గండదీయలను బలిజపల్లెకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన నిర్వాహకులు, యువకులు తప్పెట్ల దరువుకు అనుగుణంగా అడుగులు వేస్తూ.. కర్రసాము విన్యాసాలు చేస్తూ, దీపావళిని తలపించేలా బాణాసంచా పేల్చుతూ చేరుకున్నారు. బలిజపల్లెలో గంగమ్మ ప్రతిమ తయారైన అనంతరం.. నిర్వాహకులు గురువారం తెల్లవారుజామున రథంలో అమ్మవారిని ఊరేగిస్తూ ప్రత్యేకంగా తయారు చేసిన వేపమండల గుడిలోకి తీసుకొచ్చి కొలువు దీర్చారు. గంగమ్మ ఊరేగింపుగా గుడిలోకి వచ్చే సమయంలో పోతురాజును ఎగిరించేందుకు భక్తులు పోటీపడ్డారు. గంగమ్మ గుడిలోకి వస్తుండగా.. వందలాది మంది భక్తులు ముద్దలు పెట్టి అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు.

**గంగమ్మా.. కాపాడమ్మా**

ఈ సందర్భంగా భక్తులు 'అమ్మా గంగమ్మ తల్లి.. మము కరుణించి కాపాడమ్మా' అంటూ వేడుకున్నారు. గంగమ్మ గుడిలోకి చేరుకోక ముందే వేలాది మంది బలిజపల్లెకు చేరుకోవడంతో.. బలిజపల్లె గ్రామం ఇసుకవేసినా రాలనంతగా భక్తులతో నిండిపోయింది. అమ్మవారు గుడిలో కొలువు దీరాక భక్తులు ఒక్కసారిగా గంగమ్మను దర్శించుకునేందుకు త్వరపడటంతో పోలీసులు అధికారులు, సిబ్బంది అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గంగమ్మ గుడిలో కొలువుదీరగానే జాతర ఒక్కసారిగా ఊపందుకుంది. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు కిలోమీటరు మేర భక్తుల రద్దీ కొనసాగింది.

**దారులన్నీ జాతర వైపే**

బలిజపల్లె గంగమ్మ జాతరలో అమ్మవారికి వరపడితే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందువల్ల బుధవారం రాత్రి నుంచే గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు బలిజపల్లెకు చేరుకోవడం ప్రారంభించారు. జాతరలోకి వచ్చేందుకు నాలుగువైపులాఉన్న రహదారుల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో పట్టణంలోని అన్ని దారులు జాతరవైపు సాగి కోలాహలంగా మారాయి.

### గంగమ్మను దర్శించుకున్న ఆకేపాటి, పోలా

జాతర సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ పోలా శ్రీనివాస్‌రెడ్డి.. గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. బలిజపల్లె గంగమ్మ ఎంతో విశిష్టత సంతరించుకున్న దేవత అని, గంగమ్మ బలిజపల్లె గ్రామంలో స్వయంభుగా వెలియడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. బలిజపల్లె గంగమ్మ వల్ల జిల్లాలోనే కాక రాష్ట్రంలోనూ రాజంపేటకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని తెలిపారు. గంగమ్మ కరుణతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిపించి ప్రజల, రైతుల కష్టాలు తీర్చాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మున్సిపల్‌ చైర్మన్‌ పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎంతో ప్రసిద్ధి గాంచిన గంగమ్మ జాతరలో తాను ప్రతి ఏడాది పాల్గొని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, అమ్మవారిని వేడుకునే అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతమని తెలిపారు.



గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆకేపాటి, మున్సిపల్‌ చైర్మన్‌ పోలా

### వైవీయూ క్యాంపస్‌ డ్రైవ్‌కు విశేష స్పందన



మాట్లాడుతున్న వైవీయూ ప్రిన్సిపాల్‌ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్‌ : యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌ రిక్రూట్మెంట్‌ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ప్రముఖ బయోకాన్‌ మల్టీనేషనల్‌ కంపెనీ వైవీయూలో గురువారం చేపట్టిన ఎంపికలకు తిరుపతి, వైజాగ్‌, గుంటూరు, రాజమండ్రి, బాపట్ల, అన్నమయ్య, కడప జిల్లాల నుంచే కాక చత్తీస్‌ఘడ్‌, ఒడిస్సా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 500 మంది ఇంజినీరింగ్‌, డిగ్రీ పీజీ అర్హత గల అభ్యర్థులు హాజరయ్యారు. వైవీయూ ప్రిన్సిపల్‌ ప్రొఫెసర్‌ ఎస్‌ రఘునాథ్‌రెడ్డి , రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ పుత్తా పద్మలు క్యాంపస్‌ డ్రైవ్‌ ప్రారంభించి మాట్లాడారు. విశ్వవిద్యాలయ ప్లేస్మెంట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఆచార్య జి.విజయ భారతి ఎంపికల ప్రక్రియను సమన్వయం చేశారు. బయోకాన్‌ కంపెనీ క్వాలిటీ అస్యూరెన్స్‌ మేనేజర్‌ లక్ష్మీనరసయ్య, హెచ్‌.ఆర్‌ విభాగ డిప్యూటీ మేనేజర్‌ జయప్రకాష్‌, ఎస్సార్‌ డైరెక్టర్‌ జయభారత్‌, ఆపరేషన్‌ హెడ్‌ ఎస్‌హెచ్‌ అశోక్‌, క్లస్టర్‌ హెడ్‌ రాజశేఖర్‌, హెచ్‌ఆర్‌ విభాగ ఆర్‌ శరత్‌ విద్యార్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఇందులో 160 మంది అభ్యర్థులను కంపెనీ ప్రొడక్షన్‌, క్వాలిటీ కంట్రోల్‌ ,ఇంజనీరింగ్‌ అండ్‌ మెయింటెనెన్స్‌ విభాగాలలో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యురాలు ప్రొఫెసర్‌ చంద్రమతి శంకర్‌, ప్లేస్మెంట్‌ సెల్‌ ప్రతినిధులు డాక్టర్‌ లలిత, డాక్టర్‌ గణేష్‌ నాయక్‌, డాక్టర్‌ సుభోస్‌ చంద్ర, అధ్యాపక, బోధనేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆడపిల్లలకు చదువును దూరం చేయొద్దు

- విద్యార్థినుల తల్లిదండ్రుల ఆవేదన
- యూపీ ఉర్దూ స్కూల్‌ రివర్షన్‌పై మండిపాటు



ఎంఈఓ బేబికి వినతి పత్రం ఇస్తున్న మహిళలు

కమలాపురం : కూటమి ప్రభుత్వం ముస్లింలపై వివక్ష చూపిస్తోంది. ముస్లింలకు అండగా ఉంటాం.. ఆడపిల్లల చదువుకు చేయూతనిస్తాం.. అంటూ మాటల్లో ప్రేమ ఒలకబోస్తూ... చేతల్లో కర్కశత్వం చూపిస్తూ.. కపట నాటకమాడుతోంది. కమలాపురంలోని యూపీ ఉర్దూ స్కూల్‌ను రివర్షన్‌ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడమే అందుకు నిదర్శనం. కమలాపురం పట్టణ పరిధిలోని బీడీ కాలనీలో ఉన్న ఉర్దూ యూపీ స్కూల్‌ను ప్రైమరీ స్కూల్‌గా మారుస్తూ ఉత్తర్వులు అందాయి. విషయం తెలుసుకున్న స్థానికులు .. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ కార్యాలయానికి వచ్చి నిరసన తెలిపారు. తమ కాలనీలోని యూపీ స్కూల్‌ను రివర్షన్‌ చేసి ఆడపిల్లలకు చదువును దూరం చేయొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు మహబూబ్‌ బాషా, షఫీవుల్లా, హబీబున్‌, మాబుచాన్‌ తదితరులు కోరారు. ఈ విషయమై వారు ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కాలనీలో మొత్తం బీడీ కార్మికులేనని, నిరుపేదలేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 85 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలను తిరిగి రివర్షన్‌ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యంగా తమ కాలనీలోనే ఈ పాఠశాల ఉండటంతో తమ పిల్లలు చదువుకుంటున్నారని, దీనిని ప్రైమరీ పాఠశాలగా మార్చి 6, 7 తరగతులను దూరంగా ఉన్న పాఠశాలల్లో కలిపితే తమ ఆడపిల్లలు చదువుకు దూరం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలపై ప్రభుత్వం లక్షలు వెచ్చించి ఎంతో అభివృద్ధి చేసిందని, ఇలాంటి సమయంలో యూపీ పాఠశాలగా తీసివేయడం బాధాకరమన్నారు. చెన్నూరు మండలంలోని ఒక పాఠశాలలో కేవలం 25 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నప్పటికీ ఆ పాఠశాలను యూపీ పాఠశాలగానే కొనసాగిస్తున్నారని, మరి తమ బీడీ కాలనీలోని యూపీ పాఠశాలకు ఎందుకు రివర్షన్‌ ఇస్తున్నారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అనంతరం పాఠశాలలో పేరెంట్స్‌ మీటింగ్‌ నిర్వహించారు.

## ఆస్పత్రిలో రోగుల భోజన నాణ్యతపై తనిఖీ



ఆహారాన్ని పరిశీలిస్తున్న ఫుడ్‌ సేఫ్టీ అధికారులు

కడప అర్బన్‌ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ వైద్యశాల(రిమ్స్‌)లోని రోగులకు అందిస్తున్న భోజన నాణ్యతను ఫుడ్‌ సేఫ్టీ అధికారులు యండి.షంషీర్‌ ఖాన్‌, డాక్టర్‌ ఎం.హరిత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిమ్స్‌ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న భోజనం , పోషక విలువలు సంవృద్ధిగా ఉన్నాయా? లేదా అన్నది స్వయంగా పరీక్షించారు. రోగులతో మాట్లాడి అందుతున్న భోజనం గురించి వారి అభిప్రాయాలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ స్టేట్‌ కమిషన్‌ ఆఫ్‌ ది ఫుడ్‌ సేఫ్టీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్యశ్రీ ఆసుపత్రులు,ప్రైవేట్‌ ఆసుపత్రుల్లో డైట్‌ కాంట్రాక్టర్లు అందిస్తున్న భోజనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. భోజనం నాణ్యతలో ఎక్కడైనా లోపం కనబడితే తక్షణమే వాటిని స్టేట్‌ ఫుడ్‌ ల్యాబొరేటరీకి పంపించి పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తదుపరి పైన తెలిపిన ఆసుపత్రి ముడి పదార్థాల నాణ్యత కోసం ల్యాబొరేటరీకి పంపించారు. ఈక్రమంలో డైట్‌ కాంట్రాక్టర్లకు తగిన సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్‌ డైటిషన్‌ బాలాజీ నాయక్‌, డైట్‌ కాంట్రాక్టర్‌ ఖాజా పాల్గొన్నారు.

# రిమ్స్‌లో తీరు మారదంతే..!

- కంటి మహిళా ఓపీలో 10:20 గంటలైనా రాని వైద్యులు
- గైనిక్‌ ఓపీ ముందు మూలనపడ్డ కుర్చీ
- 13 మంది స్టాఫ్‌ నర్సులు డీఈఓ ఉద్యోగాలకే పరిమితం



కడప రిమ్స్‌లో కంటి విభాగం మహిళా ఓపీలో 10:20 సమయమైనా విధులకు రాని డాక్టర్లు



సర్టిఫికెట్ల పరిశీలక కోసం వచ్చిన దివ్యాంగులు, వారి సహాయకులతో భారీగా ఉన్న క్యూలైను

కడప టాస్క్‌ఫోర్స్‌ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్‌)తీరు మారడం లేదు. ఓపీ విభాగంలో మహిళా కంటి విభాగం(ఆప్తాలమిక్‌)లో గురువారం ఉదయం 10:20 గంటలైనా వైద్యులు రాకపోవడం గమనార్హం. అలాగే ఆప్తాల్మిక్‌, ఈఎన్‌టీ విభాగాలకు ×రీ వెరిఫికేషన్‌×కు వచ్చిన రోగులు, వారి సహాయకుల క్యూలైన్‌ పెద్దదిగా వుండి ఇబ్బందులకు గురవుతున్నారు. అక్కడ రిజిస్టర్‌లలో పేర్లను నమోదు చేసేందుకు విద్యార్థులను.. ఎలాంటి ఉద్యోగి పర్యవేక్షణ లేకుండానే వారికి వదిలేయడం ఎంత వరకు సమంజసం.

- ఓపీ విభాగంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కోతుల బెడద తప్పడం లేదు. ఈ కోతుల బెడదకు ఒకవైపు చిన్నారులు, బాలింతలు, వృద్ధులు బెంబేలెత్తిపోతున్నారు.
- గైనిక్‌ విభాగం ఓపీ విభాగం ముందు భాగాన విరిగిపడి మూలనపడిన ఇనుపకుర్చీ నిరుపయోగంగానే పడివుంది.
- కడప జీజీహెచ్‌ (రిమ్స్‌)లో ప్రభుత్వం మంజూరు చేసిన స్టాఫ్‌ నర్సులు 402 కాగా వీరిలో రెగ్యులర్‌ స్టాఫ్‌ నర్సులు 62 మంది, కాంట్రాక్ట్‌ పద్ధతిలో 202 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా 138 స్టాఫ్‌ నర్సుల పోస్టులు ఖాళీగా వున్నాయి. త్వరలోనే భర్తీ జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా 13 మంది స్టాఫ్‌ నర్సులు వివిధ ఓపీ, ఐపీ, పరిపాలనా విభాగాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేవలం కంప్యూటర్‌ ఆపరేటర్‌ (డి.ఈ.ఓ) పనులను మాత్రమే నిర్వహిస్తున్నారు. వీరికి ఎలాంటి షిఫ్ట్‌ డ్యూటీలు లేకపోవడం, ఆయా పోస్టింగ్‌లకే అధికారులు పరిమితం చేయడం పలురకాల ఆరోపణలకు తావిస్తోంది. ఇంకా సిటీ స్కానింగ్‌ విభాగంలో అటెండర్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి కంప్యూటర్‌ ఆపరేటర్‌గా ఐదు సంవత్సరాలుగా విధులను నిర్వహిస్తున్నాడు. తనను కంప్యూటర్‌ ఆపరేటర్‌గా తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.
- మరోవైపు కడప రిమ్స్‌ ఓపీలోని క్యాంటీన్‌ మూసివేత వ్యవహారం రోజురోజుకు ముదిరిపాకాన పడుతోంది. టెండర్‌ వేసేందుకు నోటిఫికేషన్‌ ఇవ్వాల్సిన అధికారులు ప్రస్తుత క్యాంటీన్‌ నిర్వాహకులను బలవంతంగా ఖాళీ చేయాలని చూస్తున్నారు. మొదటి రోజున ఏకంగా తాళం వేసిన ఓ ప్రైవేట్‌ వ్యక్తి మూడవరోజున ఆ తాళం కాస్తా తీసేశాడు. మరోవైపు అధికారులు తగిన ఉత్తర్వులను ఇస్తే తాము ఖాళీ చేస్తామని ప్రస్తుత నిర్వాహకులు తెలియజేస్తున్నారు. ఓపెన్‌ టెండర్‌ను నిర్వహిస్తే అందరికీ మంచిదంటున్నారు.

## జిల్లా ఆస్పత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం



రోగులతో మాట్లాడుతున్న కాయకల్ప బృందం

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిని కాయకల్ప పర్యవేక్షణ బృందం గురువారం పరిశీలించింది. జాయింట్‌ డైరెక్టర్‌ సాగర్‌, స్టేట్‌ టీబీ కార్యాలయ అసిస్టెంట్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ రవీంద్రకుమార్‌ ఆస్పత్రిని పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల పనితీరును బట్టి కాయకల్ప అవార్డును ప్రకటిస్తుంది. ఇందులో భాగంగా అధికారుల బృందం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని వార్డులతో పాటు, ఓపీ విభాగాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆస్పత్రి మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఆనంద్‌బాబు కాయకల్ప బృందానికి ఆస్పత్రిలో అందిస్తున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్‌ రూపానంద్‌, డాక్టర్‌ గోపాల్‌ పాల్గొన్నారు.


కావలెను

- అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌: డిగ్రీ చదివి కనీసం 15 సం॥ల జనరల్‌ అడ్మినిస్ట్రేషన్‌ మరియు పబ్లిక్‌ రిలేషన్‌షిప్‌లో అనుభవం కలిగి ఉండవలెను.
- ఆఫీస్‌ అసిస్టెంట్‌: ఏదైనా డిగ్రీ చదివివుండి, కనీసం 3 సం॥లు అనుభవం మరియు కంప్యూటర్‌ పరిజ్ఞానం కలిగి ఉండవలెను.
- సేల్స్‌ ఎగ్జిక్యూటీవ్స్‌: 10th పాస్‌ అయ్యి ఉండి, ఫీల్డ్‌ వర్క్‌-ఆటోమొబైల్స్‌ లేదా కన్‌స్ట్రక్షన్‌ ఎక్విప్‌మెంట్‌ లేదా FMCG రంగాలలో సేల్స్‌ / మార్కెటింగ్‌ / కలెక్షన్స్‌లలో కనీసం 3 సం॥ల అనుభవం కలిగి ఉండవలెను.

ప్రాంతాలు: కడప, ప్రొద్దుటూరు, యర్రగుంట్ల చుట్టుప్రక్కన ప్రాంతాలు

ఇంటర్వ్యూ తేది: 9 ఏప్రియల్‌ 2025, ఉ॥ 10 గం॥ల నుండి మ॥ 2 గం॥ల వరకు

మేరు ఆటోమొబైల్స్‌ ప్రై.లిమిటెడ్‌

మోడమీదపల్లె, NH-18, కడప. ఫోన్‌: 9849791770

సాక్షి క్లాసిఫైడ్స్‌

SERIVCES

LOST

S.అనురాధ W/O. S.సురేష్‌ గారి పాకాల Sub-registar office Document No : 1216/2014 పోయింది. ఎవరికైనా దొరికితే క్రింది నెంబర్‌ ను సంప్రదించండి.9182655186

WANTED

CBSE School Rajampet needs Principal, vice principal, Hostel incharges, High school all subject teachers. All primary and pre primary teachers, Male & Female wardens and PET's, Free food accommadation contact : 9100190500

పెన్షనర్స్‌ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్‌ కావలెను. జీ: 15 వేలు - 40వేలు. ఫ్రీరూం+భోజనం. HYD 8317512135

Sree Vidya Educational Services నందు పనిచేయుటకు Female Telicallers, Counsilers, Team leader, Manager కావలెను. Qualification : Any Degree, Fresher & Experience ఇద్దరు కావలెను. Address: R.S.Road, NagarajuPeta, Kadapa. Salary :10 to 25000/-.Contact 6303208193,9032063188

గమనిక


# అకాల వర్షం.. అపార నష్టం







చింతకొమ్మదిన్నె : లింగారెడ్డిపల్లె వద్ద నేలకొరిగిన అరటి చెట్లు, కడప అగ్రికల్చర్‌ : మార్కెట్‌ యార్డులో తడిచిన పసుపు కొమ్ములు, వేముల : వర్షానికి తడిసిన నువ్వుల కట్టె

- నేలకొరిగిన అరటి చెట్లు
- లబోదిబోమంటున్న రైతులు

కడప అగ్రికల్చర్‌ : పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న అన్నదాతలపై ప్రకృతి కన్నెర్ర చేసింది. మొన్న చక్రాయపేట మండలంలో ఈదురు గాలులకు 2700 ఎకరాలకు పైగా అరటి పంట నేలవాలి దెబ్బతిని రూ.50 కోట్లకుపైగా రైతులకు నష్టం వాటిల్లింది. ఆ సంఘటన మరువకముందే మళ్లీ గురువారం సాయంత్రం ఉన్నట్లుండి కురిసిన అకాల వర్షంతోపాటు ఈదురు గాలులతో రైతులకు అపారనష్టం కలిగింది. జిల్లాలోని ఖాజీపేట, సికెదిన్నె మండలాల్లో పలువురు రైతులకు చెందిన అరటి చెట్లు నేలకొరిగాయి. దీంతో రైతులకు రూ.10 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమిక పంట నష్టాన్ని అంచనా వేశారు. ఇందులో ఖాజీపేట మండలంలో 30 మంది రైతులకు సంబంధించి 71.5 ఎకరాల్లో అరటి పంట పూర్తిగా నేలకొరిగింది. దీంతో 7.15 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. అలాగే సికె దిన్నె మండలంలో 20 మంది రైతులకు సంబంధించి 35 ఎకరాల్లో అరటి పంట నెలకొరిగింది. దీంతో వారికి రూ. 3.5 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఇలా మొత్తంగా 50 మంది రైతులకు సంబంధించి 106.5 ఎకరాల్లో అరటి పంట దెబ్బతినడంతో రూ.10.65 లక్షల నష్టం జరిగిందని ఉద్యానశాఖ అధికారులు ప్రాథమిక నష్ట పరిహారాన్ని గుర్తించారు.

**మార్కెట్‌యార్డులో తడిసిన పసుపు**

కడప మార్కెట్‌యార్డులోకి వర్షపునీరు చేరి ఎండు పసుపు తడిచి ముద్దయింది. అమ్మకం కోసం మార్కెట్‌యార్డుకు తెచ్చిన పసుపును కుప్పలుగా పోసుకుని ఉండగా.. ఉన్నట్లుండి కురిసిన వర్షంతో నీరంతా పసుపు కొమ్ముల కుప్పల అడుగుభాగంలో చేరి తడిచిపోయింది. వర్షం ప్రారంభం కాగానే పసుపు కుప్పలపై పట్టలు కప్పినా అడుగుభాగంలోకి వర్షపు నీరు చేరడంతో ఎండు కొమ్ములు తడిచాయని గోపులాపురానికి చెందిన వెంకటరెడ్డి, రామాంజనేయరెడ్డి, అప్పరాజుపల్లికు చెందిన విశ్వనాథరెడ్డి, కొత్తపేటకు చెందిన సుబ్బరాయుడులతోపాటు పలువురు రైతులు తెలిపారు. వర్షపునీటితో కొమ్ములు తడవటంతో పసుపు నాణ్యత తగ్గడంతోపాటు బరువు కూడా తగ్గుతుందని వారు వాపోయారు. తడిచిన పసుపు కొమ్ములను మళ్లీ ఆరబెట్టి అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌ యార్డులో సరైన వసతులు లేకపోవడంతోనే ఎండు పసుపు తడిచిందని పేర్కొన్నారు. ఈ విషయమై యార్కెట్‌యార్డు సెక్రటరీ సుజాతతో మాట్లాడగా.. పసుపు తడిచినట్లు రైతులెవరూ తమ దృష్టికి తేలేదని తెలిపారు.

**ఈదురు గాలులతో..**

చింతకొమ్మదిన్నె : మండలంలో గురువారం మధ్యాహ్నం వీచిన ఈదురు గాలుల ధాటికి అరటి రైతులకు పెద్ద ఎత్తున నష్టం కలిగింది. నాగిరెడ్డిపల్లె, గూడావాండ్లపల్లె, బుగ్గలపల్లె, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాలలో తోటలలో గెలలతో ఉన్న అరటి చెట్లు.. ఈదురుగాలికి చాలా చోట్ల నేలకొరిగాయి. అమృతపాణి రకం అరటి చెట్లు ఎత్తుగా పెరగడం వల్ల నేలపై వాలిపోయాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశామని, తీరా చేతికి వచ్చే తరుణంలో ఈదురు గాలులు తమకు శాపంగా మారాయన్నారు. అరటికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

**దెబ్బతిన్న నువ్వుల కట్టె**

వేముల : అకాల వర్షాలతో నువ్వుల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. డిసెంబర్‌, జనవరి నెలలో సాగు చేసిన రైతులు.. నువ్వుల కట్టెను కోతలు కోసి కల్లాలకు తరలించారు. అక్కడ మూడు రోజులపాటు మగ్గిన తర్వాత నువ్వుల కట్టెను నూర్పిళ్ల కోసం వేశారు. ఎండలు బాగా ఉంటే రెండు, మూడు రోజులలో నువ్వుల కట్టెను తీసివేసి.. నువ్వులను వేరు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే ఈలోగా అకాల వర్షాలు రావడంతో కల్లాల్లో ఉన్న నువ్వుల కట్టె తడిసి ముద్దమైంది. నువ్వుల కట్ట కింద ఉన్న నువ్వులు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట సాగు చేసి మూడు నెలలపాటు కాపాడుకుంటే నోటికాడికి వచ్చిన తర్వాత వర్షార్పణం కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

## కేంద్ర కారాగారాన్ని పరిశీలించిన జడ్జి

కడప అర్బన్‌ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌ జి.శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్‌.బాబా ఫక్రుద్దీన్‌ తమ సిబ్బందితో కలిసి గురువారం కడప నగర శివార్లలోని పురుషుల కేంద్ర కారాగారం, మహిళల కారాగారంలోని ప్రిజన్‌ లీగల్‌ ఎయిడ్‌ క్లినిక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీలతో మాట్లాడారు. సకాలంలో డాక్టర్‌ సలహాలు తీసుకుంటూ మందులు వాడాలన్నారు. అనంతరం కారాగారం పరిసరాలను, టాయిలెట్లను, వసతి గదులను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇచ్చారు. ఫిర్యాదుల పెట్టెను పరిశీలించడం జరిగినది, ప్రిజన్‌ లీగల్‌ ఎయిడ్‌ క్లినిక్‌ ప్రాధాన్యతను తెలియజేశారు. కారాగారం లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ సిస్టం మొదలగు అంశాలను వివరించారు. లీగల్‌ సర్వీసెస్‌ హెల్ప్‌లైన్‌ నెంబర్‌ 15100 పై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురుషుల కేంద్ర కారాగారము సూపరింటెండెంట్‌ రాజేశ్వరరావు, మహిళ కారాగారపు సూపరింటెండెంట్‌ కృష్ణవేణి, డాక్టర్లు, పారా లీగల్‌ వలంటీర్లు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి ఎస్‌.బాబా ఫక్రుద్దీన్‌